క్లుప్తంగా

టీచర్ల బదిలీలు, చేరికలు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో చేపట్టిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా శనివారం పలువురు టీచర్లు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లగా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు స్థానిక పాఠశాలల్లో చేరినట్లు ఎంఈఓ పి.కృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు అశ్వారావుపేట మండలానికి మొత్తం 31 మంది బదిలీలు, పదోన్నతులపై రాగా.. ఈ మండలం నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు వేరే మండలాలకు బదిలీపై వెళ్లారని తెలిపారు. అదే విధంగా స్థానిక పాఠశాల్లో విధులు నిర్వహిస్తున్న 18 మంది ఉపాధ్యాయులు, ఈ మండలంలోనే ఇతర పాఠశాలల్లో సర్దుబాటు అయినట్లు వివరించారు.

రేపు క్రీడా పాఠశాలలకు ఎంపికలు

గుండాల: హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ కీడ్రా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాల కోసం ఈనెల 24న మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల వద్ద ఎంపికలు జరగనున్నట్లు ఎంఈఓ పెండెకట్ల క్రిష్ణయ్య, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హరికృష్ణలు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ ఎంపిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నాలుగొవ తరగతి చదువుతున్న విద్యార్థులు అన్ని కులాలకు చెందిన, ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. విద్యార్థులు బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, 3వ తరగతి ప్రోగ్రేస్ కార్డు, కుల ధృవీకరణ పత్రంతో పాటు నాలుగు పాస్ ఫోటలతో హాజరు కావాలని సూచించారు.

రేపు ఐటీడీఏ ఎదుట నిరసన

దుమ్ముగూడెం: టీపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపులో భాగంగా గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల షెడ్యూలును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న ఐటీడీఏ ఎదుట నిరసన ప్రదర్శన చేయనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, మండల ప్రధాన కార్యదర్శి రవి నాయక్‌లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు భద్రాచలంలోని బస్టాండ్ సెంటర్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ, ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన, వినతిపత్రం అందించడం వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కదిలి రావాలన్నారు.

25న కలెక్టరేట్ ముట్టడి

ములకలపల్లి: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25వ తేదీన జరుపతలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల నాయకులు నిమ్మల మధు, రజక సంఘం నాయకులు ముదిగొండ రాంబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎంపీఓ లక్ష్మయ్యకు, ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి, జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, నెలకు 26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. జీపీ కార్మికులు చిక్కుల శ్రీనివాస రావు, గంటా శ్రీనివాసరావు, వర్కా రుక్మాంగ ధర రావు, మేకల రమేశ్, కారంపూడి సాయి రత్న, కొక్కెరగడ్డ సతీశ్ పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ ఎదుట ధర్నా

చర్ల: కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 26న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాకు కార్మికులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకుడు గొని నాగేశ్వ రావు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో గల ఆటోస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయడం, కేంద్రం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌ల రద్దు తదితర డిమాండ్లతో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మునలి సతీష్, నాయకులు వెంకటరెడ్డి, నవీన్, వీరబాబు, రమేష్ పాల్గొన్నారు.

బదిలీలు చేపట్టాలి

బూర్గంపాడు: గిరిజన సంక్షేమశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.సత్తిబాబు డిమాండ్ చేశారు. శనివారం ఉప్పుసాక గిరిజన ఆశ్రమ పాఠశాలలో భోజన విరామ సమయంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమశాఖలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్‌లు లేకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. జీఓ నెంబర్ 317 బాధిత ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలల్లో నూతన పోస్టులు మంజూరు చేయాలన్నారు. హెచ్ఎం కృష్ణ, ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాసరావు, అన్నపూర్ణ, మీరాబాయి, బాలు, రవి, కిషన్, అనసూయ, ధర్మరాజు, వెంకటేశ్వర్లు, సరస్వతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

అ'పూర్వ' ఆదరణ



పట్టణంలో జావ విక్రయిస్తున్న 'పల్లెజావ' బండి


విక్రయానికి సిద్ధంగా రాగి, జొన్న, మిక్స్ జావలు

- పాత ఆహార అలవాట్లపై జనం మొగ్గు
- జొన్న రొట్టె, రాగి జావకు పెరుగుతున్న డిమాండ్
- ఆరోగ్యానికి ఎంతో మేలంటున్న వైద్యులు

సండే స్పెషల్

భద్రాచలంటౌన్: పూర్వం గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యవసాయ పనులు, ప్రయాణాలు చేసే సమయంలో తప్పకుండా జొన్నరొట్టెలు, రాగి జావను వెంట పెట్టుకొని వెళ్లేవారు. ప్రస్తుతం మనం ఉదయం లేవగానే తినే టిఫిన్‌కు బదులు అప్పట్లో మన పూర్వీకులు జావతోనే పూర్తి చేసేవారు. రాగి, జొన్న జావ, రొట్టె తినే వారు ఎంతో దృఢంగా, ఆరోగ్యంగా ఉండే వారు. కాలక్రమేన రాగి, జొన్న జావ, రొట్టెలు కనుమరుగై రకరకాల టిఫిన్లు అందుబాటులోకి వచ్చాయి. పట్టణ, గ్రామాల్లో సైతం టిఫిన్ సెంటర్లు వెలువడంతో ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పక్కకునెట్టి ఉదయం లేవగానే టిఫిన్ సెంటర్లకు పరుగులు పెడుతున్నారు. ఈ క్రమంలో రోగాలు పెరిగిపోవడంతో వైద్యుల సూచనల మేరకు ప్రజలు మళ్లీ పాత ఆహార అలవాట్లపై మొగ్గు చూపుతున్నారు. రాగి, జొన్న జావలతో పాటు జొన్న రొట్టెలు, రాగి సంకటి వంటి పూర్వపు ఆహారాన్ని ఆరగిస్తున్న ఆదరిస్తున్నారు.

ఆరోగ్యం.. ఆదాయం

జిల్లాలోని ప్రధాన పట్టణాలలో ప్రతి రోజు ఉదయం రాగి, జొన్న జావలు, సాయంత్రం జొన్న రొట్టెలు, రాగి సంకటి వంటి వాటిని వ్యాపారులు భిన్న రుచుల్లో తయారు చేస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే రాగి, జొన్న జావ, అవిసె లడ్డులతో పాటు పలు రకాల మొలకలను విక్రయిస్తున్నాడు. వీటి తయారీని పలువురు మహానగరాల్లో నేర్చుకొనగా కొందరు యూట్యూబ్‌లో చూసి నేర్చుకుని ప్రజలను ఆకర్షించే విధంగా కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారు. రోడ్డు పక్కన విక్రయిస్తు జీవనోపాధి పొందుతున్నారు. మొదట్లో పట్టణ వాసులు పెద్దగా ఆసక్తి చూపకపోయిన తరువాత వాటిని తాగెందుకు మక్కువ చూపుతున్నారు. ఉదయం మైదానంలో వ్యాయమానికి వచ్చే వారితో పాటు వివిధ పనులపై బయటకు వచ్చే వారుసైతం ఈ జావను తాగేందుకు ఇష్ట పడుతున్నారు. దీంతో రోజుకు రూ.1500ల నుంచి రూ.2 వేల వరకు ఆదాయం వస్తుండగా ఇందులో 30 శాతం ముడి సరుకుల ఖర్చులు పోతున్నట్లు నిర్వాహకులు తెలుపుతున్నారు. రాగి, జొన్న జావ గ్లాస్ రూ.20, రెండు మిక్స్ రూ.25, అవిసెలడ్డు రూ.10, జావ పార్శిల్ రూ.25ల చొప్పున ధరలు ఉన్నాయి. మొత్తం వీటిద్వారా కొనేవారికి ఆరోగ్యం అందుతుండగా అమ్మేవారికి ఆదాయం సమకోరి జీవనోపాధి చేకూరుతోంది.

జావ వల్ల ప్రయోజనాలు

- రాగి జావ శరీరానికి మంచి బలాన్ని ఇస్తుంది.
- ఎదిగే పిల్లలకు దీనిని ఇవ్వడం వల్ల శక్తివంతంగా తయారవుతారు.
- ఇది చలువచేస్తుంది. అన్నం తినాలనే కాంక్షను తగ్గిస్తుంది. తద్వారా బరువు తగ్గుతారు.
- అలసటను పోగొడుతుంది. ప్రతి రోజు ఉదయం టిఫిన్‌కు బదులు రాగి జావ తాగితే శరీర దృఢత్వం పెరుగుతుంది.
- రక్తపోటు, షుగర్ వ్యాధి ఉన్నవారు రాగి, జొన్న జావ తాగితే నియంత్రనలోకి వస్తాయి.
- రక్తస్రావంతో ఇబ్బంది పడుతున్నవారు తాగితే రక్తం గడ్డకట్టుకుంటుంది.
- నీరసంతో క్షీణించినవారికి, అమితమైన వేడితో బాధపడుతున్న వారికి రాగి జావ చాలా ఉపయోగకరం.
- స్థూలకాయం సమస్యతో ఇబ్బంది పడే వారు ఉదయం రాగి జావ తాగడం శ్రేయస్కరం.
- బలవర్ధకమైనది, వీర్యపుష్టిని ఇచ్చేదిగా రాగి జావ మేలు చేస్తుంది.

ఆదరణ బాగుంది..

భద్రాచలం పట్టణంలో పల్లె జావ బండి ద్వారా విక్రయాలు మొదలు పెట్టిన్నప్పుడు ప్రజల నుంచి అంతగా ఆదరణ లభించలేదు. కాని ఇప్పుడు ఆదరణ బాగుంది. ఆరోగ్యానికి మంచి చేసే రాగి, జొన్న జావ, మిక్స్ జావ తాగెందుకు చిన్నాపెద్దలు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో రోజు వ్యాపారం బాగానే సాగుతోంది. జావలో వినియోగించే ముడి సరుకుల ధరలు పెరగడంతో ఇబ్బందిగా ఉంది.

– భాస్కర్, వ్యాపారి, భద్రాచలం

ప్రతిరోజు జావ తాగుతున్నా..

ఆరోగ్యానికి మేలు చేసే రాగి, జొన్న మిక్స్‌డ్ జావను ప్రతి రోజూ తాగుతున్నాను. గతంలో ప్రతి రోజు ఉదయం టిఫిన్ చేసేవాడిని. తరువాత రాగి, జొన్న జావ సెంటర్ వచ్చిన తరువాత టిఫిన్ మానేశా. వైద్యులు సైతం ఈ జావను తాగడంతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని చెప్తున్నారు. దీంతో సాధారణ టిఫిన్‌ల కన్నా జావలకే ప్రాధాన్యత ఇస్తున్నాను.

– శ్రీనివాస్, భద్రాచలం

ఉత్సాహంగా ఉంటుంది

ప్రతి రోజూ మైదానంలో వాకింగ్ చేసిన తరువాత ఒక గ్లాస్ జావ తాగితే ఉత్సహంగా ఉంటుంది. దీంతో ప్రతి రోజు రాగి, జొన్న జావలను తాగుతున్నా. రాగి, జొన్న జావల గురించి నా స్నేహితులకు సైతం చెప్పాను. వారు సైతం ప్రతి రోజు వచ్చి తాగుతున్నారు. ప్రస్తుత కల్తీ ఆహారం కంటే సహజ సిద్ధమైన రాగి, జొన్నలతో తయారు చేసే జావలను తాగడం ఆరోగ్యానికి మంచిదని భావిస్తున్నా.

– లక్ష్మణ్, భద్రాచలం

ఘనంగా వేంకటేశ్వర కల్యాణం


స్వామి వారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం ఘనంగా జరిపించారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారిని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి దంపతులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణం అనంతరం ఆలయ అధికారులు భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శివాలయంలో చండీ హోమం

మండల కేంద్రమైన అన్నపురెడ్డిపల్లిలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో చండీహోమం జరిపించారు. శనివారం ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ హోమశాలలో అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా చండీహోమం జరిపించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆలయంలో పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకున్నారు. ఆపై తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కొత్తగట్లలో రాపిడ్ ఫీవర్ సర్వే

చర్లరూరల్: మండలంలోని కొత్తగట్ల గ్రామంలో శనివారం రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధ పడేవారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్న పిల్లలకు వ్యాక్సినేషన్ నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు ఎవరికైనా జ్వరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సత్యనారాయణపురం వైద్య సిబ్బంది పద్మావతి, రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్త సారమ్మలు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై స్క్రీనింగ్

చర్లరూరల్: మండలంలోని సత్యనారాయణపురం సీహెచ్‌సీ పరిధిలోని బూరుగుపాడు గ్రామంలో శనివారం దానవాయిపేట సబ్ సెంటర్ వైద్య సిబ్బంది అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. అక్కడి బాధితులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని వారికి జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ముత్తమ్మ, గాదెమ్మ, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులకు యూనిఫాం పంపిణీ


యూనిఫాం, ఇతర వస్తువులు అందజేస్తున్న సూపర్‌వైజర్లు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఎస్అండ్‌పీసీకి అనుబంధంగా పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు మురళీ మ్యాన్ పవర్ ఏజెన్సీ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా యూనిఫాం, రక్షణ పరికరాలు అందించారు. ఈ సందర్భంగా గార్డులు మాట్లాడుతూ.. తమ విజ్ఞప్తి మేరకు రెయిన్‌కోట్, వాటర్ బాటిల్, షూ, టార్చిలైట్ వంటి పరికరాలు ఉచితంగా అందించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రామవతార్, దొమ్మేటి సుధాకర్, పుట్ట రవి, వీరబాబు, రాజశేఖర్, రామకృష్ణ, ఇతర ప్రైవేట్ గార్డులు పాల్గొన్నారు.

ఆదివాసీగూడెంలో వైద్యశిబిరం

చంద్రుగొండ: మండలంలోని ముద్దుకూరు గ్రామ శివారు మంగళిగుంపులో నివాసముంటున్న ఆదివాసీలకు ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో ఆదివాసీలకు వైద్య పరీక్షలు చేశారు. జ్వరపీడితుల నుండి రక్తనమూనాలు సేకరించారు. పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ ప్రియాంక ఆదివాసీలకు సూచించారు. ఈ శిబిరంలో సిబ్బంది ఎస్తారురాణి, కృష్ణయ్య, సుశీల, రాందాస్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

ములకలపల్లి: సింగరేణి బొగ్గుగనుల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు అన్నారు. ప్రైవేటీకరణను నిరసిస్తూ రాష్ట్రకమిటీ పిలుపులో భాగంగా సింగరేణి కార్మికులకు మద్దతుగా శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బొగ్గుబావులకు కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకే పాలకపక్షం ప్రైవేటీకరణ యత్నాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో ముదిగొండ సావిత్రి, ముదిగొండ లక్ష్మి, మందపురి రాజమ్మ, కందుకూరి విజయకుమారి, అరుణ, బొమ్మగాని సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ వితరణ

గుండాల: వాసవి క్లబ్ డాన్ టు డస్క్ 2024 సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ గ్రీన్ ఫీల్డ్స్ మండల అధ్యక్షుడు మానాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యాక్రమాలు నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగానే 30 పిల్లలకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్నులు తదితర సామాగ్రిని అందించామని తెలిపారు. త్వరలోనే యూనిఫాం కూడా అందిస్తామని తెలిపారు. తవిడిశెట్టి నాగరాజు, గౌరిశెట్టి శరత్, రాంబాబు, మానాల శ్రావన్, వీరన్న, నాగమల్లయ్య, భరత్, కిరణ్, ఉపాధ్యాయులు నారాయణమ్మ, మంజుల, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

అశ్వాపురం: నూతన జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జితేష్ వి.పాటిల్‌ను మండల కేంద్రానికి చెందిన శివకామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్, దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు దోసపాటి పిచ్చేశ్వరరావు శనివారం కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పిచ్చేశ్వరరావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపిక బహూకరించారు.

బాధితురాలికి అండగా ఎమ్మెల్యే


బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాధితురాలికి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మెరుగైన వైద్యం అందేందుకు కృషి చేశారు. మండలంలోని నాచారం గ్రామానికి చెందిన జల్లేపల్లి నాగమణి హృదయ సంబంధిత వ్యాధితో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో, హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఆమె కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే జారేకు తెలియజేసి, ఆదుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే.. ఆమెను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి, మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. బాధితురాలికి హృదయ సంబంధిత శస్త్ర చికిత్సను ఆస్పత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ సీతారాం బృందం విజయవంతం చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ల బృందంను ఎమ్మెల్యే అభినందించారు. శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న బాధితురాలిని పరామర్శించి, అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

చర్యలు తీసుకోవాలి

చర్ల: బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులంతా తిరిగి బ్యాంకులకు చెల్లించాలని రైతులపై ఒత్తిడి చేస్తున్న బ్యాంకర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా భద్రాచలం డివిజన్ కార్యాదర్శి కొండా చరణ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాలు తీసుకున్న రైతుల పేర్లను మైకుల ద్వారా ప్రచారం చేస్తూ రుణాలు చెల్లించాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఓ పక్క కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీపై కసరత్తు చేస్తుండగా మరో పక్క బ్యాంకుర్లు ఈ విధంగా వ్యవహరించడంలో అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. బ్యాంకర్లకు రైతు రుణ మాఫీపై ఆదేశాలు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి కొండా కౌశిక్, నాయకులు పాలెం చుక్కయ్య, చెన్నం మోహన్‌రావు, మొహిముద్దా పాల్గొన్నారు.

ఏరియా జీఎంకు సన్మానం


ఏరియా జీఎంను సన్మానిస్తున్న ఏఐటీయూసీ నేతలు

మణుగూరుటౌన్: ఇటీవల అధికారిక యూరఫ్ దేశాల పర్యటనను ముగించుకుని మణుగూరు వచ్చిన ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం మణుగూరు ఏరియాలోని గుర్తింపు సంఘం నాయకులు, ప్రాతినిధ్య సంఘం నాయకులు వేర్వేరుగా శనివారం ఆయన చాంబర్‌లో పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అధికారిక విదేశీ పర్యటన విజయవంతంగా పూర్తి చేసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్, నాయకులు రామనర్సయ్య, మేకల ఈశ్వర్, పుల్లారావు, ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు, కార్యదర్శి షాబుద్దీన్, సమ్మయ్య, రేవంత్ ఉన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు..

మణుగూరురూరల్: పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో పని చేస్తూ పదోన్నతిపై కొత్తగూడెం ఎస్‌బీఐ రీజినల్ కార్యాలయానికి బదిలీ అయిన బ్రాంచ్ మేనేజర్ భూక్యా రాములను బ్యాంక్ సిబ్బంది, ఉద్యోగులు పుష్పగుచ్ఛం, శాలువాలతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న నూతన బ్రాంచ్ మేనేజర్ ఆర్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బ్రాంచ్ మేనేజర్‌గా భూక్యా రాములు బ్యాంక్ అభివృద్ధికి చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. మేనేజర్ రాములు భవిష్యత్తులో మరిన్ని పదవులను అలంకరించాలని ఆయన ఆకాంక్షించారు. ఎస్‌బీఐ బ్రాంచ్ సిబ్బంది ఎంఎస్ లక్ష్మణ్, జి.మోహన్‌రావు, సిహెచ్ భరత్, కె.ప్రవీణ్, కె.నిశిత, రాంబాబు, రమణి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి పరామర్శ

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాత మధుసూదన్‌ను భద్రాచలం డివిజన్ బీఆర్ఎస్ నాయకులు శనివారం ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. ఇటీవలే అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, అన్నె సత్యనారాయణ మూర్తి, ఆకోజు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాయంకు..

అశ్వాపురం: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తల్లి రాములమ్మ ఇటీవల మృతి చెందటంతో మణుగూరులో ఎమ్మెల్యే నివాసంలో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రాములమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం ఎమ్మెల్యే పాయంను పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, బట్టా సత్యనారాయణ, యక్కటి సత్యనారాయణరెడ్డి, ఆవుల రవి, సామకూరి వెంకన్న, బచ్చు వెంకటరమణ, చెంచల రాము, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ తాతా మధును పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్‌తోనే రైతుల అభివృద్ధి



భద్రాచలంటౌన్: సమావేశంలో మాట్లాడుతున్న పొదెం వీరయ్య


అశ్వాపురం: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న భిక్షమయ్య, నాయకులు

భద్రాచలంటౌన్: దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే రైతాంగ అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల కాలంలో రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించిందని, తద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఒకే దఫాలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించిందని పేర్కొన్నారు. అలాగే రైతు వరి నారు పోయేకముందే మేలోనే సన్నాలకు రూ.500 బోనస్ ప్రకటించడంపై ఈ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వంగా నిరూపించుకుందని చెప్పారు. సమావేశంలో మండల అధ్యక్షుడు పరిమి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తమ్మల్ల వెంకటేశ్వర్లు, దుమ్ముగూడెం మండల అధ్యక్షుడు వీరమాచినేని వినీల్, తాళ్లూరి చిట్టిబాబు, శేషు, సుధాకర్, కొలపూడి వరుణ్, కుంచాల రమేష్, శీలం రామ్మోహన్ రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని రెండు లక్షల రుణమాఫీ ప్రకటించి సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి నిరూపించారని మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా రుణమాఫీ, బోనస్ ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతాంగం పక్షాన కాంగ్రెస్ పార్టీ తరపున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మంత్రి వర్గానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివసైదులు, గుడిపూడి కోటేశ్వరరావు, దొబ్బల వెంకటప్పయ్య, పుచ్చకాయల శంకర్, సామా శ్రీనివాసరెడ్డి, గాండ్ల సురేశ్, అబ్దుల్లా, కూరపాటి సౌజన్య, వరలక్ష్మి, కుర్రం రవి, పాతూరి వెంకన్న, పెనుగొండ సాంబశివరావు, సత్యనారాయణ, జీవీ, ఆర్ఎంపీ కల్యాణ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అశ్వాపురం: ఎన్నికల హామీ అయిన రూ.2 లక్షల రుణమాఫీపై నిర్ణయం తీసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతిగా నిలిచిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. రైతు రుణమాఫీపై మంత్రి మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్‌బాబు, బట్టా సత్యనారాయణ, పాడియం అనిల్‌కుమార్, లంకమల్ల కొండలరావు, చెంచల రాము, బొజ్జా కృష్ణ, భద్రారెడ్డి, సుబ్బారావు, ఆవుల రవి, సామకూరి వెంకన్న, బూతం వెంకన్న, నరసింహారావు, అంజిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.